క్లుప్తంగా

సక్రమంగా మెనూ అమలు



విద్యార్థినులకు అన్నం వడ్డిస్తున్న పగడాలమ్మ

సారవకోట: స్థానిక కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని టెక్కలి డిప్యూటీ ఈవో గార పగడాలమ్మ శుక్రవారం సందర్శించారు. విద్యార్థినుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. నిబంధనల మేరకు సిలబస్ పూర్తి చేయాలని, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థినులకు అన్నాన్ని స్వయంగా వడ్డించారు. ఎంఈవో ఎంవీ రమణ, ఎస్‌వో సునీత ఉన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా



సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న అధికారులు

మెళియాపుట్టి: సచివాలయాల స్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, అర్హత ఉన్నా అందనివారి జాబితా, ఎందుకు అందలేదు అనే విషయాలపై ఏపీపీఏ సంస్థ ఆధ్వర్యంలో మండలస్థాయి ముఖాముఖి కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏపీపీఏ కోఆర్డినేటర్ రమణ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, అర్హత, పథకాలు అందకపోతే దానికి గల కారణాలను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. ఎంపీడీవో చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, ఏపీవో రవి, ఏపీఎం లలిత, బ్రెడ్స్ సంస్థప్రతినిధులు పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ ఏర్పాటు



దాతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైకిల్ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. వ్యాపారవేత్తలు లాడి శ్రీకృష్ణ, బలరాంలు వారి తండ్రి మల్లికార్జునరావు జ్ఞాపకార్థం సుమారు లక్ష రూపాయలతో దీన్ని నిర్మించారు. ప్రధానోపాధ్యాయుడు టి.కేశవరావు సమక్షంలో శుక్రవారం ప్రారంభించారు. అనంతరం దాతలను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

లక్కుపురంలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బూర్జ: పాలవలస సచివాలయం పరిధి లక్కుపురం గ్రామంలో బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీపీ కర్నేన దీప శిబిరాన్ని ప్రారంభించగా.. 56 మందికి వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇటీవలన వర్షాలు పడి గ్రామంలోకి భారీగా నీరు చేయడంతో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా వైద్యశిబిరం నిర్వహించడంతోపాటు క్లోరినేషన్ చేపట్టినట్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, సీహెచ్‌వో కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు టి.రాజేశ్వరరావు, లఖినాన సరోజిని, ఏఎన్ఎం చిన్నమ్మడు, ఎంఎల్‌హెచ్‌పీ కె.అలేఖ్య, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పొందూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీపాన హరిహరరావు శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

25 నుంచి సోషల్ ఆడిట్ గ్రామ సభలు

సరుబుజ్జిలి: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఉపాధిహామీ పనులపై గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఏపీఓ బొత్స పార్వతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామసభల అనంతరం ఈనెల 30న మండలకేంద్రం సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహిస్తామని వెల్లడించారు.

● వితరణ



నరసన్నపేట కళింగ వైశ్య సేవా సంఘం, హిరమండలం శ్రీకృష్ణ మిత్ర బృందం ఆధ్వర్యంలో కొత్తూరు మండలం పారాపురంలో ఉంటున్న గొట్టిపాటి అప్పారావు కుమారుడు ప్రణయ్ వైద్యానికి రూ. 48 వేలు వితరణ చేశారు. ఈ విషయాన్ని కళింగ వైశ్య సేవా సంఘం ప్రతినిధి ముచ్చేటి సుధాకర్ శుక్రవారం తెలిపారు. ప్రణయ్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో అతని తండ్రి విజ్ఞప్తి మేరకు దాతల నుంచి విరాళాలు సేకరించారు. లాడి శ్రీకృష్ణ, ఆర్పీ ఫౌండేషన్ ప్రతినిధి బాలు పాల్గొన్నారు.

-నరసన్నపేట

● పంపిణీ



రొట్టవలస గ్రామానికి ఈఏడాది కొత్తగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మంజూరైంది. దీంతో అక్కడ చదువుతున్న విద్యార్థినులకు దాతలు దుస్తులు సమకూర్చారు. వీటిని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, రావివలస సర్పంచ్ వండాన కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

-సరుబుజ్జిలి

● ప్రారంభం



నెల్లిపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసంఘం కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. మహిళా స్వయం శక్తి సంఘాలు అభివృద్ధి చెందడానికి గ్రామసంఘం కార్యాలయం ఎంతగానో దోహదపడుతుందని సర్పంచ్ మానుకొండ రాజేశ్వరి అన్నారు. సంఘాలు సమావేశాలు నిర్వహించుకోవడానికి భవనం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కో–ఆర్డినేటర్ సుభద్ర, వీవోఏ రమా, భారతి, మహిళలు పాల్గొన్నారు.

-ఆమదాలవలస రూరల్

దోమల నివారణకు చర్యలు



పాతపట్నం:చెరువులో గంబూషియా చేపపిల్లలను విడిచిపెడుతున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి



ఎల్.ఎన్.పేట: చెరువులో చేప పిల్లలు విడిచిపెడుతున్న అధికారులు

● డీఎంహెచ్‌వో మీనాక్షి

పాతపట్నం: దోమల నివారణ అందరి బాధ్యతని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. వీటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయవద్ద ఉన్న చెరువు, అచ్చుతాపురం గ్రామంలోని ముత్యాలమ్మ చెరువులో శుక్రవారం దోమల లార్వా నివారణ కోసం గంబూషియా చేప పిల్లలను ఆమె విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షకాలంలో దోమలు ఎక్కువగా ఉంటాయని, వీటి నివారణకు గంబూషియా చేపపిల్లలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి పి.వి.సత్యనారాయణ, ఏఎంవో ఎస్.శ్రీనివాసరావు, బైదలాపురం, గంగువాడ పీహెచ్‌సీ వైద్యులు శ్రీధర్, శివకుమార్, వై.కె.శ్రీనివాసరావు, లింగమూర్తి పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ఎల్.ఎన్.పేట: దోమలు విజృంభించకుండా పరిశుభ్రత పాటించాలని సీతంపేట ఐటీడీఏ సబ్ యూనిట్ మలేరియా నివారణ అధికారి డాక్టర్ అచారి పిలుపునిచ్చారు. తురకపేట కోనేరు చెరువులో గంబూషియా చేపపిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దోమలతో అనేక వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. దోమల నివారణ కోసం ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సామూహిక కార్యక్రమాలతో దోమల నివారణ సాధ్యం అవుతుందన్నారు. ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటామో మన పరిసరాలను అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి, ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్, తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ లక్ష్మీదీప్, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయండి



ప్రద్యూమ్నకు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ కన్వీనర్ ధర్మాన కృష్ణచైతన్య కోరారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యూమ్నను అమరావతిలో శుక్రవారం కలిసి విన్నవించారు. పట్టణంలో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉండగా కిలోమీటరు వరకూ పూర్తయిందని.. మిగిలిన రెండు కిలోమీటర్ల పనులు పూర్తి కోసం రూ. 11.4 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి కూడా హామీ ఇచ్చిన విషయాన్ని ముఖ్యకార్యదర్శికి వివరించారు. అలాగే నరసన్నపేటలో స్టేడియం నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. ఈమేరకు ముఖ్యకార్యదర్శి ప్రద్యూమ్న సానుకూలంగా స్పందించారని కృష్ణ చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు.

అర్హులందరికీ 'జగనన్న చేదోడు' వర్తింపు



రజకవీధిలో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

నరసన్నపేట: అర్హులందరికీ జగనన్న చేదోడు పథకాన్ని వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని బీసీ కార్పొరేషన్ ప్రతినిధి బి.సుదర్శనరావు, ఎంపీడీవో బి.మధుసూదనరావు అన్నారు. మేజరు పంచాయతీ నరసన్నపేట సచివాలయం–1 పరిధిలో ఉన్న జగనన్న చేదోడు లబ్ధిదారుల జాబితా ప్రకారం ఇంటింటికీ వెళ్లి శుక్రవారం అర్హులను పరిశీలించారు. ఈ సచివాలయం పరిధిలో 162 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఒక సచివాలయం పరిధిలో ఇంతమంది లబ్ధిదారులు ఉండటంతో అర్హులను గుర్తించమని బీసీ కార్పొరేషన్ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో తనిఖీలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ అర్హులేనని నిర్ధారించామన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలో అర్హులందరికీ జగనన్న చేదోడు అందిస్తామని.. లబ్ధిదారులు అందరూ విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

మహిళా రిజర్వేషన్ ఆమోదంపై హర్షం



బూర్జ: కర్నేన దీప

బూర్జ: మహిళలకు అన్నిరంగాల్లోనూ ప్రాధాన్యం కల్పించేలా 33 శాతం రిజర్వేషన్ ఆమోదించడం సంతోషకరమని ఎంపీపీ కర్నేన దీప అన్నారు. మహిళా బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం మంచి తరుణమని శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

చారిత్రక ఘట్టం



మీసాల రజిని

హిరమండలం: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చడం చారిత్రక ఘట్టమని హిరమండలం ఎంపీటీసీ సభ్యురాలు మీసాల రజిని అన్నారు. ఈ బిల్లు ద్వారా మహిళల స్థాయి, గౌరవం పెరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం ఇప్పటికే కేటాయించడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కొత్తూరు: మాట్లాడుతున్న శాస్త్రవేత్త సునీత

కొత్తూరు: ఎక్కువ పోషక విలువలు ఉండే ఆకుకూరలు, చిరుధాన్యాలను రక్తహీనత ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఆహారంగా ఇవ్వడం వలన సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త సునీత అన్నారు. కుంచాలపేటలో కొత్తూరు సీడీపీఎస్ ప్రాజెక్టు స్థాయిలో పోషణ సంబరాలను సీడీపీవో విమలకుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు బాలామృతంతో చేసిన వంటకాలను ప్రదర్శించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. సూపర్‌వైజర్లు శాంతకుమారి, సుధావాణి, బేగమ్, సరస్వతి, భవాని, ఈశ్వరి, జ్యోతి, నవభారతి, చైల్డు రైట్ ప్రొటక్షన్ ఫోరం జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పాతపట్నం: రక్తహీనత నివారణకు గర్భిణులు, బాలింతలు రోజు చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో విమలారాణి అన్నారు. ఇందిరమ్మకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. చైల్డ్‌లైన్ ప్రతినిధి జగన్నాథ, సూపర్‌వైజర్ అనురాధ, ఉషాశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



సూదిరాయిగూడలో నిర్మాణాలు పరిశీలిస్తున్న రమేష్

ఎల్.ఎన్.పేట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ ఏఈ కె రమేష్ అన్నారు. కరకవలస, సూదిరాయిగూడ, సుమంతాపురం, దబ్బపాడు, మిరియాపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. అక్టోబర్ నెలాఖరుకు గృహ ప్రవేశాలు చేయాలన్నారు. లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ సింహాచలం ఉన్నారు.

విద్యార్థినులకు నేత్ర పరీక్షలు



కొత్తూరు: నేత్ర పరీక్షలు చేస్తున్న జానకీరామయ్య

పొందూరు: లోలుగు కేజీబీవీలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థినులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆఫ్తాలమిక్ అసిస్టెంట్ అనసూయ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, సీహెచ్‌వో రవికుమార్ పాల్గొన్నారు.

కుంటిభద్రలో 158 మందికి..

కొత్తూరు: కుంటిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 158 విద్యార్థులకు కంటి పరీక్షలను ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకీరామయ్య చేశారు. వీరిలో 12 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి జిల్లా అంధత్వ నివారణసంస్థ ద్వారా ఉచితంగ కంటి అద్దాలు అందిస్తామన్నారు. హెచ్ఎం కృష్ణవేణి, వైద్య సిబ్బంది ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

సరుబుజ్జిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని వైద్యాధికారి సంతోష్‌కుమార్ అన్నారు. రావివలస, పాలవలస, పెద్దవెంకటాపురం గ్రామాల్లో సర్వే కార్యక్రమాలను శుక్రవారం పర్యవేక్షించారు. రావివలప సర్పంచ్ వండాన కృష్ణ, ఎమ్ఎల్‌పీహెచ్‌ఓ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాదు, ఆశవర్కర్లు భవానీ, విజయ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మంచుదుప్పటి



దట్టంగా కురుస్తున్న మంచు

సారవకోట: సారవకోటను శుక్రవారం తెల్లవారుజామున మంచు కమ్మేసింది. ఉదయం 7.30 గంటల వరకు మంచు దట్టంగా కురవడంతో పిల్లలు, వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు.

రీసర్వేతో రైతులకు మేలు

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించడం వలన రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సర్వే డిప్యూటీ తహసీల్దార్ బాడాన సునీల్ అన్నారు. కట్యాచార్యులపేట గ్రామ సచివాలయంలో రీసర్వేపై గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేరుకుపోయిన భూసమస్యలకు పరిష్కారం దక్కుతుందన్నారు. రైతులు తమ వివరాలను గ్రామ సచివాలయానికి అందజేయాలని సూచించారు. సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ అందజేత

పాతపట్నం: విద్యార్థులు సాంకేతిక విద్యను అవర్చుకోవాలని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రామమూర్తి అన్నారు. పదో తరగతి విద్యార్థులకు గణితం స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఉచితంగా అందజేశారు. గణిత ఉపాధ్యాయుడు ఆర్.మధుసూదనరావు విద్యార్థుల కోసం ఉచితంగా మెటీరియల్‌ను సమకూర్చారు.

సెలవులు మంజూరు చేయాలని విజ్ఞప్తి

కొత్తూరు: ఈ నెల 25 తేదీన విజయవాడలో నిర్వహించనున్న సమగ్ర శిక్షా సత్యాగ్రహ దీక్షలో పాల్గొనేందుకు సామూహిక సెలవులు ఇప్పించాలని సంబంధిత సిబ్బంది కోరారు. ఈ మేరకు ఎంఈవో–1, 2లు గోవిందరావు, శ్రీనివాసరావులకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సమగ్ర శిక్షా సంఘం జిల్లా ప్రతినిధి కె.రాజేష్, స్వప్న పాల్గొన్నారు.

రక్షణ చట్టం తీసుకురావాలి

కొత్తూరు: న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకు రావాలని ఆలిండియా న్యాయవాదుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం అప్పారావుకు కోరారు. కొత్తూరు నాలుగు రోడ్లు కూడలి వద్ద న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకు రావాలని కోరుతూ శుక్రవారం ఆందోళన చేపట్టారు. న్యాయవాదులు అరుబోలు ధర్మారావు, చల్లా రవికిరణ్, హరిబాబు, ప్రసాదరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రోగ్రామ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లింగరాజు అన్నారు. ఆయుష్మాన్ భవ ఆరోగ్య, సంరక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి మెనింగివారి వీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించారు. ఫార్మసిస్ట్ చింతాడ వరుణ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఉపేంద్ర పాల్గొన్నారు.

ఓంద్రుజోలలో పొలంబడి

కొత్తూరు: వరి పంట సాగులో యాజమన్య పద్ధతులను రైతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీ రాజగోపాలరావు అన్నారు. ఓంద్రుజోలలో నాలుగో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని ఏవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏలు బూరెవిల్లి సౌజన్య, గాగోటి షణ్ముఖ, వసంత కుమారి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి మృతికి సంతాపం

పాతపట్నం: ఎ.ఎస్.కవిటి గ్రామ సచివాలయంలో అసిస్టెంట్ సర్వేయర్‌గా పనిచేస్తున్న వాన నాగు (44) అనారోగ్యంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గురువారం మృతి చెందారు. ఈయన పాతపట్నం శివశంకర్ కాలనీ 3వ లైన్‌లో ఉంటున్నాడు. ఈయన మృతిపై తహసీల్దార్ రవిచంద్ర, డీటీ ప్రసాదరావు సంతాపం తెలియజేశారు.

పాఠశాలలో వార్షిక తనిఖీలు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో అన్ని సబ్జెక్టులపై సామర్థ్యం పెంచే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, బాధ్యతగా బోధన పద్ధతులు అమలు చేయాలని ఎంఈవోలు యు.శాంతారావు, దాలినాయుడు అన్నారు. వీఎన్ పురం యూపీ స్కూల్లో శుక్రవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. కొందరు విద్యార్థుల్లో తెలుగు, లెక్కలు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ప్రమాణాలు ఆశాజనకంగా లేవన్నారు.

క్రిష్టాపురంలో వైద్య పరీక్షలు

పొందూరు: క్రిష్టాపురంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడివలస పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమేష్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులను అందజేశారు. సీహెచ్‌వో సుగుణమ్మ, ఎంఎల్‌హెచ్ రవితేజ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డుల పరిశీలన

హిరమండలం: విద్యార్థుల సామర్థ్యాలను మరింత పెంచాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. హిరమండలం పెద్దకోరాడ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వచ్చే నెల రెండో తేదీ నుంచి జరగనున్న ఎఫ్‌ఏ–2 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు.

పూజలందుకుంటున్న ఏకదంతుడు



ఆమదాలవలస రూరల్: అఖండ దీపారాధనలో మహిళలు



బూర్జ: కాలపర్తిలో పూజలందుకుంటున్న గణనాథుడు



హిరమండలం: వినాయకునికి నైవేద్యంగా సమర్పించిన 108 రకాల వంటకాలు



నరసన్నపేట: రెడ్డికిపేటలో భజన చేస్తున్న బృంద సభ్యులు

బూర్జ: గణపతి నవరాత్రులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏకదంతుడుకి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఐదో రోజైన శుక్రవారం వినాయకుడి మండపాలు భక్తులతో రద్దీగా మారాయి. బూర్జ మండలం కాలపర్తి గ్రామంలో సర్పంచ్ బొడ్డేపల్లి వరహాలునాయుడు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న భజనలు

నరసన్నపేట: వినాయక మండపాల వద్ద కమిటీ సభ్యులు ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. మహిళలు కుంకుమ పూజలు చేశారు. రెడ్డికిపేట వినాయక విగ్రహం వద్ద దూకులపాడుకు చెందిన భజన మండలి సభ్యులు 12 గంట భజన చేసి ఆకట్టుకున్నారు. సర్పంచ్ అవ్వ రవీంద్ర ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భజన మండలి సభ్యులను సత్కరించారు.

మారుతీనగర్‌లో..

మారుతీనగర్‌లోని బొజ్జ గణపయ్య వద్ద మహిళలు దీపారాధన చేపట్టారు. సాయంత్రం దీపాలు వెలిగించి విఘ్నేశ్వరునికి పూజలు చేశారు.

అఖండ దీపారాధన

ఆమదాలవలస రూరల్: శ్రీనివాసాచార్యులపేటలో వినాయక పంచమరాత్రి ఉత్సవాలు సందర్భంగా వినాయకుని ఆకృతిలో అఖండ దీపారాధన చేపట్టారు. గ్రామంలో యువత అంతా కలిసికట్టుగా ఉత్సవాలు నిర్వహించడంతో సందడి వాతావరణం నెలకొంటుంది. భక్తులు అధికంగా పాల్గొన్నారు.

వైభవంగా లక్షదీపోత్సవం

కొత్తూరు: కొత్తూరులోని గోగులు రామారావు నాయుడు షాపింగ్ కాంప్లెక్స్‌లో (నూకాలమ్మ గుడి వద్ద) ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద లక్షదీపోత్సవం కన్నుల విందుగా జరిగింది. భక్తులు ఉత్సాహంగా దీపాలను వెలిగించి పూజలు చేశారు.

108 వంటకాలతో నైవేద్యం

హిరమండలం: హిరమండలం గిరిజాలవీధిలో కొలువుదీరిన గణేశునికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గణపతికి 108 రకాల పిండి వంటలు సమర్పించారు.




కొత్తూరు: లక్ష దీపాలను వెలిగిస్తున్న భక్తులు



నరసన్నపేట: దీపారాధనలో మహిళలు

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపిక పోటీలు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాతపట్నం: నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు పాతపట్నం మినీస్టేడియం వేదికగా శుక్రవారం నిర్వహించామని ఎంఎస్‌ఓ, పీడీ వై.శేఖర్‌బాబు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు అండర్–14, అండర్–17 విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. పోటీలను వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ ప్రారంభించారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నకుమారి, హెచ్ఎం కుమారస్వామి, ఎస్ఎంసీ ఛైర్మన్ ధనుంజయరావు, పద్ద నేతాజీ, రాము, వరదరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.